క్లుప్తంగా

క్రీడాదుస్తులు అందజేత



క్రీడాదుస్తులు అందిస్తున్న లోహిత్ ఆనంద్

పాల్వంచ: త్వరలో హర్యానాలో జరగనున్న ఆల్ ఇండియా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో మూడు రోజులుగా సెలక్షన్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కేటీపీఎస్ 5,6,7 దశల క్రీడాకారులకు సోమవారం డ్రెస్ మెటీరియల్‌ను జెన్ స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. క్రీడాకారులు ఆల్ ఇండియా స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీలు మహేష్, వీరస్వామి, క్రీడాకారులు నాని, రాజుల రమేష్, ఆరీఫ్, బూర్గుల భాస్కర్, వల్లమల్ల ప్రకాష్, శ్యాం, యాకయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాలు...



సరుకులు అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: అగ్ని ప్రమాదంతో ఇల్లు దగ్ధమై సర్వసం కోల్పోయిన సాయిరాంతండాకు చెందిన గుగులోత్ ఈరు కుటుంబాన్ని జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇదుపుల రాజు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆయన బియ్యం , నిత్యావసరాలు, కూరగాయలు, దుస్తులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఇల్లంగి సంతోష్, ఇమ్రాన్, చందు, బి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ టికెట్ ఇవ్వండి..

పాల్వంచరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్వంచ జెడ్పీటీసీ టికెట్ తనకు కేటాయించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ కోరారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను సోమవారం భద్రాచలంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ... పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ పటిష్టత కోసం శ్రమించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరిగిందని, మండలంలో పార్టీ సభ్యత్వాలను కూడా అధికంగా నమోదు చేయించినట్లు పేర్కొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా యుగంధర్



నియామకపత్రం అందుకుంటున్న యుగంధర్

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా యాస యుగంధర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ లీగల్ చైర్మన్ వెల్లంకి వెంకటేశ్వరావు, న్యాయవాదులు, మహమ్మద్ సాధిక్‌పాషా, తోట మల్లేశ్వరావు, ఎర్రపాటి కృష్ణ, గడిపల్లి మహేష్, వేల్పుల సుధాకర్, మారపాక రమేష్, లక్కినేని సత్యనారాయణ, పిట్టల రామారావు, మేకల దేవేంద్ర, ఉప్పుశెట్టి సునీల్‌కుమార్, డి.సమంత్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

పాల్వంచరూరల్: లారీ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని రంగాపురం గ్రామం వద్ద బీసీఎం జాతీయ రహదారిపై సోమవారం భద్రాచలం నుంచి పాల్వంచ వస్తున్న లారీ, పాల్వంచ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయలు కాగా ఆటో పాక్షికంగా దెబ్బతిన్నది. క్షతగాత్రులను 108 ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా... ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రంగారావు కుటుంబానికి మంత్రి పరామర్శ

పాల్వంచ: పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు తల్లి వీరరాఘవమ్మ దశదిన కర్మకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరరాఘవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, ఎడవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలెప్పుడు?

- సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది
- కొత్త గనులు, సొంతింటి కలపై కార్మికుల ఎదురుచూపులు



గనిలో విధులకు బయలుదేరుతున్న కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 14 నెలలు పూర్తయింది. 2023 డిసెంబర్ 27న ఎన్నికలు జరగగా, ఆరు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ, ఐదింట్లో ఏఐటీయూసీ గెలిచింది. కానీ ఐఎన్‌టీయూసీ కంటే ఏఐటీయూసీకి ఓటింగ్ శాతం అధికంగా ఉండడంతో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ యూనియన్ కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయాన కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ ఆరు హామీలు ఇవ్వగా.. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అటు ప్రభుత్వం, ఇటు ఐఎన్‌టీయూసీ హామీల ఊసెత్తకపోవడంతో కార్మికులు పెదవి విరుస్తున్నారు.

ఇవీ హామీలు..

- కొత్త గనులు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. అయితే, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం పదేళ్ల కాలంలో ఒక్క భూగర్భగనినీ ప్రారంభించలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి ఉండడం గమనార్హం. మూడేళ్లుగా వీకే–7 గనికి కనీసం ఈసీ అనుమతులు రాలేదు. అదిగో, ఇదిగో అని కాలయాపన చేస్తుండగా, అందులో పనిచేసిన కార్మికులు చెట్టుకొకరు పుట్టకొకరు అన్న చందంగా పనిచేయాల్సి వస్తోంది.
- సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్న హామీ సైతం అటకెక్కిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. సుమారు 50 రోజులు హైదరాబాద్ కేంద్రంగా గనుల వేలం పాట సాగితే ఏ నాయకుడూ ప్రశ్నించలేదని చెబుతున్నారు.
- సింగరేణి కార్మికులందరికీ సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని ప్రకటించగా, ఇప్పటి వరకు అడుగు కూడా ముందుకు పడలేదు. అంతేకాక కనీసం కార్మిక ప్రాంతంలో పాత గృహాలు మరమ్మతులు చేయించుకునే పరిస్థితి లేదంటున్నారు. పాత క్వార్టర్లను ఉచితంగా లేదా నామమాత్రపు ధరతోనైనా కేటాయించాలని కార్మికులు కోరుతున్నారు.
- సింగరేణి కార్మికులు చెల్లించే అలవెన్స్ (పెర్క్స్) ఆదాయంపై ఇన్‌కం టాక్స్‌ను యాజమాన్యంతో కట్టిస్తామని ఎన్నికల వేళ చెప్పారు. ప్రస్తుతం ఈ విధానం కోలిండియాలో అమలవుతోంది. కానీ సింగరేణిలో ఇటీవల ప్రతీ కార్మికుడికి వేతనం నుంచి ఆదాయపు పన్ను పేరుతో సుమారు మూడు మాసాల జీతం రికవరీ చేసినా ఎవరూ స్పందించలేదు.
- అన్ని ఏరియాల్లోని ఆస్పత్రుల ఆధునికీకరణతో పాటు ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇవేమీ నెరవేరకపోగా కార్మికుల ఆరోగ్యాన్ని ఆస్పత్రుల్లో పట్టించుకోవడం లేదని, యూనియన్ నాయకులు చెబితేనే కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని విమర్శిస్తున్నారు.
- మహిళా కార్మికులకు వసతులు కల్పించడమే కాక అండర్ గ్రౌండ్‌లో దింపకుండా సర్ఫేస్‌లోనే విధులు కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఇప్పుడు మహిళా కార్మికులతో పాటు అధికారులను సైతం అండర్ గ్రౌండ్‌లోకి దింపుతుంటే మాట్లాడే వారు లేకుండా పోయారని చెబుతున్నారు.

ఏ హామీ అమలు కాలేదు..



కార్మికులకు ఇచ్చిన ఆరు హామీలను గెలిచిన నాయకులు తుంగలో తొక్కారు. మా హయాంలో గనుల వారీగా సమస్యలు గుర్తించి పరిష్కరించేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోగా హైదరాబాద్‌లో సీఎండీ గ్రీవెన్స్ నిర్వహించినా సమస్యలకు పరిష్కా రం లేదు. పద్నాలుగు నెలలైనా సీఎండీతో సాగాల్సి న స్ట్రక్చర్ సమావేశం కూడా నిర్వహించలేదు.

– మిరియాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

దేశ భవిష్యత్ గురువుల చేతుల్లోనే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం రాత్రి కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీరాగా పాఠశాలలో 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, ఉపాధ్యాయ వృత్తిలోకి రావడం ఎంతో అదృష్టమని, ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. రాజకీయాల్లోకి రాకముందు తాను రామవరంలో స్కూల్ నడిపించానని, స్కూల్ జీవితం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ మాల్లారపు వరప్రసాద్, కవిత, అడ్వకేట్ గాదె రవిశంకర్, లగడపాటి రమేష్, మదరకోల కిషోర్, జేవీ బాబు, చిట్టి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఓసీని ప్రైవేటీకరణ చేయొద్దు..



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీని ప్రైవేటీకరణ చేయొద్దని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. సోమవారం వీకే–7లో ఏ పనైనా సింగరేణి సంస్థ చేపట్టాలని, ప్రైవేట్ వారికి ఇవ్వరాదని కోరుతూ నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం జీకే ఓసీ మేనేజర్ మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలకు కార్మికవర్గం ముందుకు రావాలన్నారు. బొగ్గు గనులు రాక సింగరేణి సంస్థ రోజురోజుకు నిర్వీర్యం అవుతుంటే చేతికి వచ్చిన వీకే–7 ఓసీని ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పగించటం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సింగరేణికి దక్కాల్సిన బొగ్గు గనులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసి ప్రైవేటుకు అప్పగించిందని, నేడు అధికార కాంగ్రెస్ పార్టీ అటువంటి తప్పులు చేయకుండా ప్రైవేటీకరణను అడ్డుకుని బొగ్గు గనులను సింగరేణికే చెందే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికవర్గ పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్‌రావు, ఏరియా ఉపాధ్యక్షుడు కే.రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్య, హీరాలాల్, ఎం.ఆర్‌కే ప్రసాద్, బండారి ఎల్లయ్య, రాజేశ్వరరావు, వర్క్‌షాపు పిట్ సెక్రటరీ మధుకృష్ణ, శ్రీనివాస్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఇటీవల అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు నాయిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం పార్టీ టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో అకాలవర్షంతో చేతికొచ్చిన మొక్కజొన్న, ఆరబోసిన మిర్చి పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలను అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జరుపుల సుందర్, ఏనుటి నాగయ్య, పంతులు, లింగ, సీతారాములు, కుక్క ముడి ప్రసాద్, మదార్ పాల్గొన్నారు.

అద్దాలమేడ, కాటేజీలు సిద్ధం



కిన్నెరసానిలో నిర్మాణం పూర్తయిన అద్దాల మేడ

- స్వాధీనం చేసుకోవడంలో జాప్యం

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానిలో ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల కోసం నిర్మించిన భవనాలను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి రావడం లేదు. కిన్నెరసానిలో వివిధ అభివృద్ధి పనులకు 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10.74 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అద్దాలమేడ, తొమ్మిది కాటేజీలు, ఫుడ్‌కోర్టు నిర్మాణం చేపట్టారు. సుదీర్ఘకాలం అనంతరం తొమ్మిదేళ్లకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈనేపథ్యాన అద్దాల మేడ, కాటేజీలను స్వాధీనం చేసుకోవాలని టూరిజం శాఖ డీఈ రవీందర్ సంబంధిత శాఖకు లేఖ రాయగా, ఎకో టూరిజం శాఖ అధికారులు గత డిసెంబర్‌లో పరిశీలించినా వారి ఆధీనంలోకి మాత్రం తీసుకోలేదు. దీంతో కిన్నెరసానికి వచ్చే పర్యాటకులు బస చేసే వీల్లేకుండా పోతోంది. ఈ విషయమై టూరిజం శాఖ డీఈ రామకృష్ణను వివరణ కోరగా... భవనాలను స్వాధీనం చేసుకోవాలని ఎకో టూరిజం శాఖ అధికారులకు రెండు నెలల క్రితమే లేఖ రాశామని తెలిపారు.

కారుణ్య నియామకాలకు ముఖాముఖి



ముఖాముఖి నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆదేశాల మేరకు సోమవారం ఎస్‌ఓటూ జీఎం కార్యాలయంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి ఆధ్వర్యంలో కారుణ్య నియామకాల కోసం ముఖాముఖి నిర్వహించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి సాక్ష్యుల సమక్షంలో ముఖాముఖి నిర్వహించి అన్ని వివరాలు నమోదు చేశారు. ఇంటర్వ్యూ పూర్తి అయిన తర్వాత నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, క్లర్క్ రామకృష్ణ, అపర్ణ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర పనులు చెప్పొద్దు



వీరబాబును పరామర్శిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులతో డ్యూటీకి సంబంధం లేని పనులు చేయించవద్దని, వీరబాబుకు జరిగిన అధికారులే బాధ్యత వహించాలని, అతను పూర్తిగా కోలుకునేంత వరకు వైద్యం చేయించి పూర్తి వేతనం చెల్లించాలని టీయూసీఐ రీజియన్ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి ప్రధానాస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరబాబును పరామర్శించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల డ్యూటీకి సంబంధం లేని పనులు చెయించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఏరియా అధికారులు వీరబాబుకు న్యాయం చేయాలని, ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మణుగూరు ఏరియా కార్యదర్శి సంజీవరెడ్డి, సతీష్, విజయ్, బానోత్ ధర్మా తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎఫ్‌ఆర్‌ఓ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం అటవీ రేంజ్ అధికారిగా చలపతిరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొమరారం ఎఫ్‌ఆర్‌ఓ ఉదయ్ ఇటీవల ఏసీబీకి పట్టుబడటంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. అతని స్థానంలో కాచనపల్లి ఎఫ్‌ఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న చలపతిరావుకు అటవీశాఖ ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

డిగ్రీ కాలేజీ అభివృద్ధికి సహకరిస్తా..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమగ్రాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కళాశాల నూతన అడ్మిషన్ల కోసం ప్రచార పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలకు ఉన్న ఏకైక డిగ్రీ కళాశాల మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటైందని గుర్తుచేశారు. నూరు శాతం సదుపాయాలు, సౌకర్యాలు కలిగి ఉన్న కళాశాలలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అనుభవం, అంకితభావం కలిగిన విద్యాధికులు అధ్యాపకులుగా రావడంతో కళాశాల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్న విశ్వాసం కలిగిందన్నారు. న్యాక్‌లో ఇప్పటి వరకు మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించిన కళాశాల భవిష్యత్‌లో అటానమస్ సాధించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇంటర్ పూర్తైన విద్యార్థులు డిగ్రీ కళాశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సభ్యుడు పులిగళ్ల మాధవరావు, ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచరూరల్: నియోజకవర్గంలోని పేదప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల సంక్షేమం, సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని ద్వారా కృషి చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మండల పరిధి కేశవాపురం గ్రామంలో సోమవారం సీపీఐ శాఖ గ్రామ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలన్నీ నిరుపేద ప్రజలకు అందించేందుకు శ్రమిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతీ పంచాయతీలో పార్టీ ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి, పార్టీ పటిష్టత కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం 11మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా అంగోతు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా తేజావత్ సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో మండల కార్యదర్శి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అంగోతు కృష్ణ, వీరన్న, ధరావత్ శ్రీనివాసరావు, అంగోతు రంగా, శ్రీను, మాలోతు పద్మ, రంగమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి..



తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జూలూరుపాడు: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (జేయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిప్రతాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు వి.పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులుగా పని చేస్తున్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేదన్నారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జర్నలిస్టుల యూనియన్ మండల ఉపాధ్యక్షుడు మోదుగు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బండ్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి షేక్ సిద్దిక్, కోశాధికారి సవడం వెంకటేశ్వర్లు, ఆరెబోయిన కృష్ణ ప్రసాద్, మోదుగు ఆదామ్, భూక్యా రత్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతనివ్వండి..



మాట్లాడుతున్న జమలయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): కార్పొరేట్ సంస్థలు, మాల్స్ ఏర్పాటుతో నష్టపోయి ఉపాధి కోల్పోతున్న టైలర్ వృత్తిదారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామవరం పంజాబ్‌గడ్డ సీపీఐ కార్యాలయంలో సోమవారం టైలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడీమేడ్ వస్త్రాల ప్రవేశంతో టైలర్లు ఉపాధి కోల్పోయి పస్తులు ఉండాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల విద్యార్థుల యూనిఫాం టైలర్లకు అప్పగించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా ధరలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా స్థిరపడేందుకు ఒక్కో టైలర్ కుటుంబానికి రూ.5లక్షలు వడ్డీ లేని రుణం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం కల్పించి భరోసా కల్పించాలన్నారు. సమావేశంలో టైలర్లు ఎస్.నాగేశ్వరరావు, రమేష్, కొండ శ్రీనివాస్, సురేష్, సాయి, స్నేహ, రమ, సోనీ, కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఇన్సూరెన్స్ మాకొద్దు..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టొద్దని, ప్రభుత్వమే నేరుగా సంక్షేమ కార్మికులకు అందజేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలను పణంగా పెట్టి నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలు దుర్భరమైన జీవనం గడుపుతున్నారని వాపోయారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, 55 సంవత్సరాలు దాటిన కార్మికులకు నెలకు రూ.10వేలు పెన్షన్‌గా చెల్లించాలని, కార్మికుల అడ్డా వద్ద సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. రావూరి ఉపేందర్, నర్సింహారావు, సామేలు, సతీష్, వెంకన్న, వెంకటేశ్వర్లు, అశోక్, బాలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: పాపకొల్లులోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజారులు సున్నం ఓంకారాచారి, శంకరాచారిల ఆధ్వర్యంలో నవగ్రహ మండపరాధన, హోమం, కలశ పూజలు, గణపతి పూజ, శ్రీకోటమైసమ్మ తల్లి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, సున్నా కృష్ణయ్య, లకావత్ లచ్చు నాయక్, తాళ్లూరి అచ్చయ్య, గోపు రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.